క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: జిల్లా కేంద్రంలో బుధవారం ఉదయం 6.30 నుంచి 8.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ డి. శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఏరియాలో 11 కేవీ లైన్లలో ఉన్న చెట్లను తొలగిస్తున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. ప్రకాశంబజార్, జిల్లా కోర్టు, జెడ్పీ ఆఫీస్, మున్సిపాలిటీ ఆఫీస్, నటరాజ్ థియేటర్, రిజిస్ట్రేషన్ ఆఫీస్ ఏరియాలు, రైతు బజార్, రహమాన్‌బాగ్, శ్రీరామ్‌నగర్ కాలనీ, ఆర్పీ రోడ్డు, దేవరకొండ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ నిలిచిపోతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

కేతేపల్లి: మండలంలోని కొప్పోలు విద్యుత్ సబ్ స్టేషన్‌లో 33 కేవీ విద్యుత్ లైన్‌కు మరమ్మతులు చేపడుతున్న కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ట్రాన్స్‌కో ఏఈ గాబ్రియేల్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఉప్పలపహాడ్, కొప్పోలు, భీమారం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్


కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలంలోని రౌడీ షీటర్లకు శాలిగౌరారం సీఐ సి.శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం కౌన్సిలింగ్ ఇచ్చారు. గత సంవత్సరం అక్టోబర్‌లో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంతో మండలంలోని 14 మంది రౌడీ షీటర్లను సంవత్సరంపాటు బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు పాల్పడవద్దని వారికి సూచించారు. ఎన్నికల కోడ్ సమయంలో ఘర్షణలు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ డి.రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్‌కు ప్రశంసా పత్రం


ప్రశంసా పత్రం అందుకుంటున్న రమాదేవి

మర్రిగూడ: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్–3లో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్న రమాదేవికి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు ఉత్తమ టీచర్‌గా ప్రశంసాపత్రం అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రంలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించినందుకుగాను ఆమె సేవలను గుర్తించి సన్మానించి ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో చింతపల్లి సీడీపీఓ లావణ్యకుమారి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు కార్మికుల వినతి


వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నల్లగొండ టూటౌన్: మున్సిపల్ కార్యాలయంలో ఐదు సంవత్సరాలుగా పనిచేస్తున్న 110 మంది కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐ వర్తింపజేయాలని కోరుతూ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ. సలీం, సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, కార్మికులు భాస్కర్, మోహన్, సునీత, జానయ్య, రాము, సైదమ్మ, నాగరాజు, నగేష్, కిరణ్, నరసింహ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా


మౌనిక శేఖర్ దంపతులు

చిట్యాల: మున్సిపాలిటీలోని ఒకటో వార్డు కౌన్సిలర్ సిలువేరు మౌనిక శేఖర్ దంపతులు బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు మంగళవారం వారు తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ అధికారం కోల్పోయాక కిందిస్థాయి నాయకులను, కార్యకర్తలను పట్టించుకునే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గెలుపు కోసం కృషిచేసిన వార్డు ప్రజలు, నాయకులతో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

నీలగిరి వార్డులకు మహర్దశ

- రూ.48 కోట్లతో అభివృద్ధి పనులు
- శివారు ప్రాంతాలకు ప్రాధాన్యం
- నేడు శంకుస్థాపన చేయనున్న మంత్రి

నల్లగొండ టూటౌన్: నీలగిరి పట్టణంలోని వార్డుల్లో కాలనీలకు మహర్దశ పట్టనుంది. మున్సిపాలిటీ పరిధిలోని 48 వార్డుల్లో రూ.48 కోట్లతో కనీస మౌలిక వసతుల కల్పన కోసం మున్సిపల్ యంత్రాంగం ప్రతిపాదనలు రూపొందించింది. దీంతో వార్డుల్లో అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో అన్ని వార్డుల్లోని కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలు పూర్తి చేయనున్నారు. కొన్ని కాలనీల్లో సీసీ రోడ్లు లేకపోవడంతో చిన్నపాటి వర్షం వచ్చినా చిత్తడిగా మారుతున్నాయి. ఇలాంటి చోట్ల సీసీ రోడ్లు వేసేందుకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. నాలుగేళ్లుగా కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులకు ప్రాధాన్యత ఇవ్వలేదని కౌన్సిలర్లు విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో అన్ని వార్డుల్లో అవసరమైన చోట్ల పనులు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేశారు. కొన్ని వార్డుల్లో ఇప్పటికే వంద శాతం సీసీ రోడ్లు, డ్రెయినేజీలతో పాటు యూజీడీ కూడా ఉంది.

తీరనున్న సమస్యలు

నీలగిరి పట్టణంలో చేపట్టనున్న అభివృద్ధి పనుల్లో



శివారు ప్రాంతాలు, విలీన గ్రామాలకు అధిక ప్రాధాన్యం కల్పించనున్నారు. విలీన గ్రామాలకు యూజీడీ వచ్చే అవకాశం లేకపోవడంతో ప్రతి వీధిలో డ్రెయినేజీల నిర్మాణం చేపట్టి మురుగు సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్టనున్నారు. విలీన గ్రామాల్లో చాలాచోట్ల చిన్నచిన్న వీధులు ఉండడంతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ చేపట్టడానికి వీలు కాదు. డ్రెయినేజీల నిర్మాణం పూర్తిచేసిన తరువాత సీసీ రోడ్లు నిర్మించనున్నారు. ఒక్కో విలీన గ్రామంలో కిలో మీటర్ నుంచి రెండు కిలోమీటర్ల వరకు సీసీ రోడ్లు వేస్తే గ్రామం అంతటా పూర్తయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. పనులు పూర్తయితే ఆయా ప్రాంతాల్లో ప్రజల సమస్యలు తీరనున్నాయి.

ఇప్పటికే శిలాఫలకం ఏర్పాటు

వార్డుల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేయనున్నారు. ఇప్పటికే మర్రిగూడ బైపాస్ జంక్షన్ వద్ద శిలాఫలకం కూడా ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఎన్జీ కాలేజీ ఎదుట రూ.1.30 కోట్లతో నిర్మించనున్న ఫుడ్‌కోర్టు పనులను మంత్రి ప్రారంభించనున్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్న సమీక్ష సమావేశంలో రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొంటారు.

పనులు త్వరగా పూర్తిచేస్తాం



వార్డుల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేయడానికే ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నాం. ప్రజల అవసరాలను గుర్తించి వారికి కావాల్సిన సదుపాయాలు కల్పిస్తాం. శివారు ప్రాంతాల అభివృద్ధికి కూడా ప్రాధాన్యత కల్పిస్తున్నాం. పనులు త్వరగా పూర్తి చేసి ప్రజల సమస్యలు తీరుస్తాం.

–బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్, నల్లగొండ

నకిరేకల్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నార్కట్‌పల్లి : నకిరేకల్ నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మంగళవారం నార్కట్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రుల సహకారంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. నార్కట్‌పల్లి మండలం చిన్న తుమ్మలగూడెం గ్రామంలో రూ.10లక్షల నిధులతో సీసీ రోడ్డు, షాపల్లి గ్రామంలో రూ.10లక్షలతో సీసీ రోడ్డు, నార్కట్‌పల్లి మండల కేంద్రంలో రూ.15లక్షలతో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. అభివృద్ధి పనులు వేగవంతంగా చేపట్టాలని, పనుల్లో నాణ్యత ఉండాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, మాజీ జెడ్పీటీసీ దుదిమెట్ల సత్తయ్య, మాజీ సర్పంచులు పెల్లెంల అచ్చాలు, స్రవంతి, గడ్డం పశుపతి, జెర్రిపోతుల భరత్ తదితరులున్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

కేతేపల్లి: గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. కేతేపల్లి, ఇనుపాముల,


నార్కట్‌పల్లి : అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

కొర్లపహాడ్, చీకటిగూడెం, గుడివాడ, కాసనగోడు, కొప్పోలు, ఉప్పలపహాడ్ గ్రామాల్లో రూ.80లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీరోడ్ల పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్, వైస్ ఎంపీపీ వీబీ మాధవి, మాజీ ఎంపీపీ గుత్త మంజులమాధవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌యాదవ్, ఎంపీటీసీలు బొజ్జ సుందర్, ఎడ్ల సంధ్య, పి.ఇందిర, నాయకులు వెంకటనర్సయ్యయాదవ్, రమేష్, పుల్లయ్య, జాన్‌రెడ్డి, సాల్మన్, ప్రవీణ్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ


చిట్యాల : పరీక్ష సామగ్రి అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ చినవెంకట్‌రెడ్డి


శాలిగౌరారం: పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి

చిట్యాల : విద్యార్థులు ఏకాగ్రతతో చదివి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు సమకూర్చిన పరీక్ష సామగ్రి ప్యాడ్లు, పెన్నులను ఆయన అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి నర్సింహ, ప్రధానోపాధ్యాయుడు కర్ణాకర్, కౌన్సిలర్లు కోనేటి కృష్ణయ్య, రెముడాల లింగస్వామి, బెల్లి సత్తయ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జడల చినమల్లయ్య, ఎస్కే ఇబ్రహీం, నర్ర భిక్షంరెడ్డి, రెముడాల మధు, జిట్ట చంద్రకాంత్, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం మండలంలో..

శాలిగౌరారం: విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకుంటే జీవితంలో రాణించవచ్చని శాలిగౌరారం సీఐ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వల్లాల గ్రామంలో గల ప్రభుత్వ మోడల్‌స్కూల్, జెడ్పీ ఉన్నత పాఠశాల, శాలిగౌరారంలోని కేజీబీవీలలో పదో తరగతి విద్యార్థులకు ఇటుకులపహాడ్ గ్రామానికి చెందిన చైత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, ఇతర సామగ్రి పంపిణీ చేశారు. మోడల్‌స్కూల్‌లో జరిగిన కార్యక్రమానికి సీఐ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ప్యాడ్లు అందజేసి మాట్లాడారు. చైత్ర ఫౌండేషన్ చైర్మన్ యంగలి రామకృష్ణ, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ రాగిణి, కేజీబీవీ ఎస్‌ఓ ఉమాదేవి, లయన్స్‌క్లబ్ చార్టర్డ్ అధ్యక్షుడు బుడిగె శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మునుగోడులో..

మునుగోడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు నల్లగొండ లయన్స్‌క్లబ్ సభ్యులు మంగళవారం పరీక్ష ప్యాడ్లతోపాటు పెన్నులు, పెన్సిళ్లు, ఇతర సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎల్‌వీ కుమార్, సభ్యులు కేవీ ప్రసాద్, మదన్, మందడి నర్సిరెడ్డి, భాస్కర్, వీరెళ్లి సత్యనారాయణ, హెచ్‌ఎం రవీందర్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు యూసుఫ్‌పాష పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ అందజేత

మునుగోడు: మండలంలోని సింగారం గ్రామానికి చెందిన మునగాల సత్తయ్య అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోగా అయనకు మంజూరైన రూ. 2.50ల చెక్కును మంగళవారం ఆ గ్రామస్తులు బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు పోగుల ప్రకాష్, కాంగ్రెస్ నాయకులు కుంభం చెన్నారెడ్డి, భూపాల్ రెడ్డి, జిల్లా వెంకటేషం, జనగాం రాములు, వట్టే వెంకట్‌రెడ్డి, కుంభం వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం


నగదు అందజేస్తున్న ఉపాధ్యాయులు

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి ఉన్నత పాఠశాలలో పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేసిన నారాయణదాసు రోజారాణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా ఆమె కుమారుడు నాగఫణీంద్ర చదువుల కోసం మండలంలోని ఉపాధ్యాయులు, ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు సమకూర్చిన రూ.71 వేలను మండల విద్యాధికారి కూకుట్ల నర్సింహ మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు బి.భిక్షపతి, కె.సుధాకర్‌రెడ్డి, ఎం.వరలక్ష్మి, సరిత, ఆర్.జయకాంత్, ఎం.ప్రవళిక, జాన్, తిరుమలమ్మ, శ్రీను, శ్రీలత, గీత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అల్పాహారం అందిస్తా

మర్రిగూడ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు చొరవ చూపుతానని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు పానుగోటి అంజన్‌రావు అన్నారు. మంగళవారం పాఠశాలతోపాటు గ్రామ భారతి ఆవాస కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు బాలల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, విద్యతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి ప్రత్యేక తరగతులు బోధించాలన్నారు. ఆయన వెంట యాదయ్య, రవి తదితరులు ఉన్నారు.

ఇన్సూరెన్స్ చెక్కు అందజేత


ఇన్సూరెన్స్ చెక్కు అందిస్తున్న రఘునాథస్వామి

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని పానగల్లుకు చెందిన బన్నె శంకరయ్య గత సంవత్సరం ఐపీపీబీ, టాటా జీఏజీ ఇన్సూరెన్స్ పాలసీ చేశాడు. ఇటీవల సెంట్రింగ్ పని చేస్తున్న సమయంలో ప్రమాదానికి గురై మృతి చెందాడు. మంగళవారం స్థానిక లయన్స్ క్లబ్‌లో జరిగిన పోస్టల్ అకౌంట్ మేళాలో శంకరయ్య భార్య పద్మకు రూ. 10 లక్షలను ఇన్సూరెన్స్‌ను అధికారులు అందజేశారు. కార్యక్రమంలో నల్లగొండ డివిజన్ సూపరింటెండెంట్ రఘునాథస్వామి, ఐపీపీబీ మేనేజర్ శ్రవణ్, పోస్టల్ ఇన్‌స్పెక్టర్లు బుచ్చిబాబు, రవి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మర్రిగూడ: మండల కేంద్రంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో మంజూరైన రూ.10లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను ఆ గ్రామ మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడి కట్టుబడి ఉన్నారని అన్నారు. అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. అయన వెంట పానుగోటి శేఖర్, గ్యార యాదయ్య, నీల శంకర్, చంద్రయ్య, పిట్టల కృష్ణ, యాదయ్యలు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

పంట నష్టపరిహారం అందించాలి


నకిరేకల్: మర్రూరులో ఎండిన పంటలను పరిశీలిస్తున్న నాయకులు

నకిరేకల్: వర్షాభావ పరిస్థితుల కారణంగా నీరు లేక పంటలు ఎండిపోయిన రైతులను ఆదుకోవాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి అంబటి చిరంజీవి ప్రభుత్వాన్ని కోరారు. నకిరేకల్ మండలంలోని మంగళపల్లి, మర్రూరు, గోరెంకలపల్లి గ్రామాల్లో ఏఐకేఎంఎస్ నాయకులు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండిన పంటలను అంచనా వేసి ఎకరాకు రూ.20 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పసుపులేటి సోమయ్య, అంబటి నర్సయ్య, బండారి మురళి, వెంకటయ్య, మామిడోజు వెంకటేశ్వర్లు, నారగోని లక్ష్మి, యాసా శోభా తదితరులు పాల్గొన్నారు.

వరి పంటల పరిశీలన

మర్రిగూడ: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో వరి పంటను ఏఓ హేమలత మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి చేలు పిలక దశ నుంచి చిరు పొట్ట దశలో ఉన్నాయని తెలిపారు. పలుచోట్ల వరి ఎర్రబారిందని, జింకు లోపం కారణంగా పంటలు ఇలా మారుతున్నాయన్నారు. ఫార్ములా 4తోపాటు జింక్ సల్ఫేట్‌ను పది రోజుల వ్యవధిలో రెండుమార్లు పిచికారీ చేస్తే పంటలను సంరక్షించుకోవచ్చన్నారు. ఏఈఓలు విజయ్‌కుమార్, రాధిక, శ్రీలతలు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలి

కట్టంగూర్ : తమకు లెప్రసీ సర్వే పెండింగ్ బిల్లుతోపాటు ఫిబ్రవరి నెల పారితోషకం చెల్లించాలని కోరుతూ మండలంలోని ఆశావర్కర్లు మంగళవారం కట్టంగూర్ పీహెచ్‌సీలో వైద్యాధికారి శ్వేతకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2022, 2023 సంవత్సరాల్లో చేసిన లెప్రసీ సర్వేకు నేటికీ డబ్బులు చెల్లించలేదన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించకుండా మళ్లీ సర్వే చేయాలని ఆశాలను ఒత్తిడి చేయడం సమంజసం కాదని అన్నారు. వారి వెంట సంఘం సహాయ కార్యదర్శి పెద్దులు, లింగస్వామి, బుచ్చమ్మ, లక్ష్మమ్మ, స్వప్న తదితరులున్నారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు పెంజర్ల అనిత, గద్దపాటి భారతి, సంతోష, కనకతార, రేణుక తదితరులు పాల్గొన్నారు.


కట్టంగూర్ : వినతిపత్రం అందిస్తున్న ఆశా వర్కర్లు

ఉపాధి కూలీలకు..

నార్కట్‌పల్లి : ఉపాధి హామీ కూలీలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకులు, ఐలయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని తిరుమలగిరి, మాండ్ర గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు ఆరు వారాలుగా బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

కలెక్టరేట్ ముట్టడిస్తాం

నల్లగొండటౌన్: గ్రామ పంచాయతీ కార్మికులకు ఆరు నెలలుగా రావాల్సిన వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కలెక్టర్, డీపీఓ జోక్యం చేసుకుని వేతనాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మూడు, నాలుగు రోజుల్లో వేతనాలు చెల్లించకపోతే కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

మహా పాదయాత్రకు ఘన స్వాగతం

శాలిగౌరారం: బీసీలకు జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ అన్నారు. చట్టసభల్లో బీసీల వాటా సాధన కోసం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన మహా పాదయాత్ర మోత్కూరు మండలం మీదుగా మంగళవారం శాలిగౌరారం మండల కేంద్రానికి చేరుకుంది. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద పాదయాత్రకు స్థానిక బీసీ సంఘాల నాయకులు స్వాగతం పలికారు. పాదయాత్ర ప్రతినిధులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ చట్టసభల్లో రిజర్వేషన్ సాధనకోసం బీసీలు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. చాపర్తి కుమార్‌గాడ్గె, అరుణ, రంజిత్ గౌడ్, కృష్ణమూర్తి, చింటూ, నవీన్, సైదులు, మహబూబ్‌అలీ, మల్లేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.


పాదయాత్రకు సంఘీభావం తెలుపుతున్న బీసీ సంఘాల ప్రతినిధులు

అంతరించిపోతున్న మోదుగు చెట్లు

మోదుగు పూలకు హోళీకి విడదీయలేని బంధం ఉంది. గతంలో హోళీకి వారం రోజుల ముందే మోదుగు పూలను తీసుకొచ్చి నీటిలో నానబెట్టేవారు. ఉడకబెట్టి వాటి నుంచి వచ్చే రంగు నీటిని సీసాల్లో నింపుకుని హోళీ రోజు ఒకరిపై ఒకరు చల్లుకునేవారు. ప్రస్తుతం మోదుగు చెట్లు అంతరించిపోయే దశలో ఉన్నాయి. నల్లగొండ మండలం గుండ్లపల్లిలో కనిపించిన మోదుగు పూల చెట్టును సాక్షి తన కెమెరాలో బంధించింది.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ



'గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది'

మాడుగులపల్లి : ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉందని జెడ్పీటీసీ పుల్లెంల సైదులు అన్నారు. మంగళవారం మాడుగులపల్లి మండలంలోని తోపుచర్లలో ఎన్ఆర్‌జీఎస్ రూ.10 లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు జెడ్పీటీసీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకొని గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గొని నిరంజన్, ఎరుకలి వెంకన్న, మంగ యాదయ్య, కట్టా శ్రీనివాస్ రెడ్డి, మీసాల నాగేందర్, పెరుమాళ్ల భరత్, దేవయ్య, కిన్నెర శ్రవణ్, మంగా అంజి, రాచూరి యాదగిరి, వెంకన్న, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఫౌంటేన్ కాదు.. మిషన్ భగీరథ గేట్‌వాల్వ్



ఈ ఫొటోలో కనిపించేది ఫౌంటేన్ అనుకుటే పొరపాటే. ఇది మిషన్ భగీరథ పైపులైన్ ఎయిర్‌వాల్వ్ లీకేజీ. ఈ ప్రధాన గ్రిడ్ పైపులైన్ మండలంలోని పలు గ్రామాలకు తాగు నీటిని సరఫరా చేస్తోంది. శాలిగౌరారం బస్టాప్ వద్ద గురుజాల–నకిరేకల్ ప్రధానరోడ్డు వెంట ఉన్న ప్రధాన ఎయిర్‌వాల్వ్ లీకై తాగునీరు వృథా అవుతోంది. దీంతో ఆయా గ్రామాలకు మంగళవారం నీటి సరఫరా నిలిచిపోయింది. – శాలిగౌరారం

పశువుల సంత వేలం

నార్కట్‌పల్లి : అమ్మనబోలు పశువుల సంతలో 2024–2025 ఆర్థిక సంవత్సరానికి గాను మంగళవారం వేలం పాట నిర్వహించారు. అక్కెనపల్లి గ్రామానికి చెందిన వెంకటాద్రి రూ.32 లక్షలకు వేలం పాడి పశువుల సంత నిర్వహణ దక్కించుకున్నారు. అదేవిధంగా నార్కట్‌పల్లి మండల కేంద్రంలో పశువుల సంత బహిరంగ వేలం పాట నిర్వహించగా దూదిమెట్ల శ్రీనివాస్ సంత నిర్వహణ హక్కులను దక్కించుకున్నారు. డీఎల్‌పీఓ ఫర్వేజ్, మండల ప్రత్యేక అధికారి జోత్స్న, ఎంపీటీసీ సైదులు, మాజీ సర్పంచ్ వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఏలేదందర్ పాల్గొన్నారు.

సంత వేలం వాయిదా

కట్టంగూర్ : కట్టంగూర్ మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను మంగళవారం నిర్వహించిన పశువుల సంత వేలం ప్రభుత్వ మార్జిన్ ధర రాకపోవడంతో వాయిదా వేసినట్లు ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ ఎండీ అథర్ ఫర్వేజ్ తెలిపారు. తైబజార్ వేలం పాటను కట్టంగూర్‌కు చెందిన పంతంగి రాములు రూ.1.75 లక్షలకు పాట పాడి దక్కించుకున్నట్లు తెలిపారు. పశువుల సంత వేలంలో ఆరుగురు కాంట్రాక్టర్లు పాల్గొనగా మండల కేంద్రానికి చెందిన కొంపెల్లి యాదయ్య రూ.20 లక్షలకు పాట పాడారు. వాయిదా పడ్డ సంత వేలం పాట బుధవారం నిర్వహిస్తామని, కొత్తగా వేలంలో పాటలో పాల్గొనే వారు రూ.2 లక్షల డీడీ చెల్లించి పాల్గొనవచ్చని ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ పేర్కొన్నారు. ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్ రావు, కార్యదర్శి వడ్లకొండ అశోక్ పాల్గొన్నారు.

సత్తిరెడ్డికి నివాళి

గట్టుప్పల్(చండూరు): సీపీఐ(ఎంఎల్) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, ఉమ్మడి నల్లగొండ జిల్లా కార్యదర్శి మందడి సత్తిరెడ్డి(విక్రమ్) 31వ వర్ధంతిని మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విక్రమ్ చిత్రపటానికి సీపీఐ(ఎంఎల్)ఎన్‌డీఆర్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఐఎఫ్‌టీయూ నాయకుడు గడ్డం నర్సింహులు, ఏఐకెఎంఎస్ నాయకుడు వనం యాదయ్య, పార్టీ గ్రామ కార్యదర్శి కుండే సత్యనారాయణ, మల్లేష్, సత్యనారాయణ, యాదయ్య, వెంకటేష్, యాదగిరి పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడా


చిరు ధాన్యాలతో అంగన్‌వాడీ సిబ్బంది

చండూరు: మండలంలోని కస్తాల అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలపై, తల్లిపాల ఆవశ్యకతపై చిన్నారుల తల్లులకు సూపర్‌వైజర్లు శివేషా, సుజాత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం


సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

నకిరేకల్ : టీఎస్ యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నకిరేకల్ పట్టణంలో మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. పట్టణంలోని ప్రాంతీయ కార్యాలయంలో మహిళా ఉపాధ్యాయులకు సన్మానించారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ మహిళా విభాగం జిల్లా కన్వీనర్ చింతమళ్ల వరలక్ష్మి, ప్రభుత్వ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సునీత, నోముల హైస్కూల్ హెచ్‌ఎం సుందరి, జిల్లా కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.నర్సింహమూర్తి, కె.శ్రీనివాస్,సైదమ్మ, పద్మలత, సరిత, జోయతి, సౌజతా తదితరులు పాల్గొన్నారు.